మధుయాష్కీగౌడ్‌కు స్వాగతం పలికిన నేతలు



శంషాబాద్ విమానాశ్రయంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ దుర్గారెడ్డి

చంపాపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటన ముగించుకొని శనివారం రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ దుర్గారెడ్డి బొకే అందజేసి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట న్యూ పద్మానగర్‌కాలనీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం

సైదాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునేందుకు బ్లడ్ డోనర్ లైఫ్ సేవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సరస్వతీనగర్ శిశుమందిర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్ దూట మాట్లాడుతూ శిబిరానికి స్వచ్ఛందంగా యువకులు తరలివచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. సమాజం పట్ల వారికున్న బాధ్యతకు నిదర్శనమన్నారు. రక్తదానం చేసినవారికి సంస్థ సర్టిఫికెట్లను అందజేశారు.



ఉచిత వైద్య శిబిరంలో కాలనీవాసులు

ఉచిత వైద్య శిబిరం

వనస్థలిపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ యశోధర నగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో సుమారు మూడు వందల మందికి షుగర్, బీపీ, డెంటల్, ఈఎన్‌టీ, ఈసీజీ, కంటి, దంత, జనరల్ ఫిజీషియన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ ఉపాధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ కాలనీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బిట్ల యాదగిరిరెడ్డి, మాజీ కార్యదర్శి వై.రాజారెడ్డి, ప్రకాశ్‌రావు, చంద్రమోహన్, రాములు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముగిసిన బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

వనస్థలిపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోల్‌లోని ఆర్‌ఎస్ బ్యాడ్మింటన్ స్టేడియంలో యూనిక్స్ సన్‌రైస్ రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి బాబు, సాయిరెడ్డి, ఆనంద్, సామ ప్రభాకర్‌రెడ్డి, పీవీఎల్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీహెచ్ఎస్‌లో 2006-07 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారందరు ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేశారు. జింక నరేష్‌ముదిరాజ్, బత్తిని జయంత్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, శివగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

టెట్‌కు 343 మంది అభ్యర్థులు హాజరు

కొత్తపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూ నాగోల్‌లో సీఐఎస్ డిజిటల్ ప్రైలి.లో ఆదివారం ఆన్‌లైన్ టెట్‌కు 343 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185 మంది అభ్యర్థులకు గాను 177మంది హాజరుకాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 185 మందికి గాను 166 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 8మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 19మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడికి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన పసుమాములకు చెందిన గూడెపు మధుగౌడ్ ఆదివారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తనను మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీహరి, సైదులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొత్తపేట : నాగోల్ పీఎస్ పరిధిలో ఆదివారం ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాని సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పచ్చిమడ్ల కృష్ణ, స్మిత(44) దంపతులు నాగోల్ అరుణోదయనగర్‌కాలనీలో నివాసముంటున్నారు. అతడు ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తుండగా ఆమె బ్యూటీ పార్లర్ నిర్వహిస్తుంది. తరచూ ఇద్దరి మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతూ ఉండేవి. ఇంటి నుంచి వెళ్లిపోతానని బెదిరించేది. కృష్ణ ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు ఇంటికి చేరుకుని చూసేసరికి స్మిత ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ఫోన్‌చేసినా ఆమె నుంచి జవాబు లేదని కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సరూర్‌నగర్ స్టేడియం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక, జోనల్ కమిషనర్ పంకజ, డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు



రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరులకు నివాళులర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, న్యాయమూర్తులు



వాసవీ నిలయంలో వేడుకల్లో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాంపల్లి సిటీ సివిల్ కోర్టు జడ్జి మురళీమోహన్



చంచల్‌గూడ జైలులో గౌరవ వందనం సమర్పిస్తున్న జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్



బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ పారిజాతా నర్సింహారెడ్డి, కమిషనర్ రఘు, కార్పొరేటర్లు



మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయం వద్ద వేడుకల్లో మేయర్ దుర్గ, కమిషనర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ స్వప్నచిరంజీవి, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు



లింగోజిగూడ లిబర్టీ చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

జోన్ బృందం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీలు, బస్తీల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించి, జైతెలంగాణ నినాదాలు చేశారు. హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ వద్ద ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లెలగూడ చందచెరువు కట్ట మీద గల అమరవీరుల స్తూపం వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ఆవరణలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద రంగారెడ్డి కలెక్టర్ శశాంక నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. చంచల్‌గూడ జైలులో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బందిగౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వివిధ సంఘాల, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ వద్ద జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు సింగిరెడ్డి మల్లీశ్వరీరెడ్డి, ధనలక్ష్మి వెంకట్‌రెడ్డి తదితరులు



జిల్లెలగూడ చందచెరువు కట్టపై గల అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం వేడకల్లో ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య ఇతర అధికారులు



నాగార్జునకాలనీ చౌరస్తాలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి



శంకేశ్వర్‌బజార్‌లో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, లింగాల హరిగౌడ్



శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, కమలాకర్, యాదయ్య ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి



లెక్చరర్స్‌కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు



తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్ర బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు



చంపాపేట గాంధీ చౌరస్తాలో మలిదశ ఉద్యమకారులు సిరిక నర్సింహారెడ్డి, రాము, లక్ష్మణ్



మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో పతాకాన్ని ఆవిష్కరించిన ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, డీఐ గౌరునాయుడు



కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో జాతీయజెండాను ఎగరవేస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి



బాటసింగారం రైతుసేవా సహకార సంఘంపై జాతీయ జెండాను ఎగురవేస్తున్న సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్, సంఘం డైరెక్టర్లు, సిబ్బంది



బడంగ్‌పేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్



బీజేపీ కార్యాలయంలో వేడుకల్లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు

అంబర్‌పేటలో మలక్‌పేట ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు

చాదర్‌ఘాట్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంకు చెందిన ఈవీఎంలను అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరచిన విషయం తెలిసిందే. ఈనెల 4వ తేదీన నిర్వహించే మలక్‌పేట ఓట్ల లెక్కింపు ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు నిరంతర పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ కౌంటింగ్ పరిశీలకుడిగా పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అడ్మినిస్ట్రేటర్ నిమల్ చంద్ అల్హాను ప్రత్యేకంగా నియమించింది. ఇప్పటికే ఆయన అంబర్‌పేటలోని ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు కోసం చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో 3,17,636 మంది ఓటర్లుండగా మే 13న జరిగిన పోలింగ్‌లో 42శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,35,807 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలైన ఓట్లలో 68,959 మంది పురుషులు, 66,848 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్‌ను ప్రత్యేకంగా నియమించారు. ఇలా విధులు నిర్వహించేందుకు 42మంది సిబ్బందితోపాటు మరో 50మంది సి బ్బంది కౌంటింగ్ విధులు నిర్వహించనున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల బరిలో 31మంది అభ్యర్థులు పోటీ పడగా ఒక్కో అభ్యర్థి తమ ఓట్ల లెక్కింపు కోసం 14మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకునే అవకాశముంది. అయితే ఇంతవరకు 130 మంది కౌంటింగ్ ఏజెంట్ పాసులు పొందారని ఏఆర్‌వో రాజేష్ తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత

అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే మలక్‌పేట ఓట్ల లెక్కింపులో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు మలక్‌పేట ఏసీపీ, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ శ్యాంసుందర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియం పరిసరాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేవలం కౌంటింగ్ పాసు ఉన్న వారినే అనుమతిస్తామన్నారు. ఇందు కోసం 110 మంది పోలీస్ సిబ్బందిని రంగంలోకి దింపనున్నారు. ఇందులో ఇద్దరు ఏసీపీలు, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 8మంది ఎస్‌ఐలతో పాటు 60మంది సివిల్ పోలీసులు విధులు నిర్వహించనున్నారు. మరో 50 మందినిలో మూడు ప్లాటూన్ల కేంద్ర రిజర్వు పోలీసులు, ఆర్మ్ రిజర్వు పోలీసులు, స్పెషల్ పోలీసులను రంగంలోకి దింపుతున్నామన్నారు. కౌంటింగ్ పరిసరాల్లో ఏ పార్టీకి చెందిన వ్యక్తులు కానీ, నాయకులు, కార్యకర్తలు కానీ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం వంటివి చేయరాదన్నారు. వీటిపై నగర పోలీసు కమిషనర్ నిషేదాజ్ఞలు విధించారన్నారు. మొబైల్ ఫోన్లను అనుమతించబోమన్నారు. వాటిని భద్రపరచేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

కనుల పండువగా ప్రసన్నాంజనేయస్వామికి పుష్పయాగం

కొత్తపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురి గోదా సమేత పద్మావతీవేంకటేశ్వరాలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామికి పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆంజనేయస్వామి జయంతి వేడుకల వేళ స్వామివారికి అర్చకస్వాములు రాఘవాచార్యులు, జగదీష్ స్వామి, మహంకాళి రవికుమార్‌స్వామి, శ్రీనివాస్, మాధవాచార్యులు గోదా సమేత పద్మావతీవేంకటేశ్వర స్వామికి, కాశీ అన్నపూర్ణా, విశాలాక్ష్మి సమేత విశ్వేశ్వర స్వామివార్లకు శాస్త్రోక్తంగా పూలమాలలు సమర్పించారు.

ఆలయ ప్రాంగణం గోవిందనామాలతో మారుమోగింది. తలపైన బుట్టలతో కమిటీ వారు, భక్తులు, భక్తి గీతాలకు నాట్యం చేస్తూ, పూల మాలలు తీసుకుని స్వామికి సమర్పిస్తూ, ప్రసన్నాంజనేయస్వామికి పుష్పయాగం వేదమంత్రాలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్, సలహాదారు ఎస్.వెంకటస్వామి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మునగనూర్‌లో అధికారులకే సవాలు విసురుతున్న బిల్డర్లు

- ఇరిగేషన్ కాల్వపైన భవన నిర్మాణాలు
- చేష్టలుడిగి చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- ఎమ్మెల్యే చెప్పినా బేఖాతరు

హయత్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కంచె చేను మేసిన చందంగా అధికారులు వ్యవహరించడంతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీలో చెరువులు, కుంటలకు రక్షణ లేకుండా పోయింది. పరోక్షంగా అధికారులు ఆక్రమదారులకు సహకరిస్తూ మరో పక్క ఉత్తుత్తి నోటీసులతో కాలయాపన చేసి ఆ తర్వాత భవనం పూర్తి చేసేలా కుయుక్తులు పన్ని అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాం గ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటలు, కాల్వలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాం తాల్లో నిర్మాణాలు చేస్తే సహించేది లేదని సాక్షాత్తు ఆ శాఖ మంత్రి చెబుతున్నా తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మునగనూర్‌లో మాత్రం యథేచ్ఛగా చెరువు గొలుసుకట్టు కాల్వలను ఆక్రమిస్తూ భవన నిర్మాణాలు చేస్తున్నారు. అందుకు అన్ని రకాల శాఖల అధికారులు సహకరిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మీటరు మంజూరు చేయడం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణ అనుమతులు ఇవ్వ డం, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించడం ఇలా చకచక జరిగిపోతున్నాయి. పెరిగిన భూమి రేట్లను దృష్టిలో పెట్టుకుని కాల్వలను, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాలను ఆక్రమిస్తున్నారు. ఎం తో దూరదృష్టితో ఏర్పాటు చేసిన చెరువు కాల్వలను సైతం వదలకుండా కాల్వలపైన భవన నిర్మాణాలు చేయడం ఇక్కడ విడ్డూరంగా మారింది.



ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు కాల్వ

అధికారులకే సవాలు విసురుతున్న కబ్జారాయుళ్లు..?

గొలుసుకట్టు చెరువుల్లో భాగంగా నిజాం ప్రభుత్వం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు నుంచి మునగనూర్ మీదుగా పెద్దఅంబర్‌పేట్ ఈదులచెరువు వరకు 33 ఫీట్ల కాల్వను ఏర్పాటు చేసింది. ఇటీవల కాల్వ అభివృద్ధి కోసం నిధులు కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా మునగనూర్ బలహీనవర్గాల కాలనీ వెనుక రొట్టెలో నిగుట్ట కిందనుంచి ఉన్న కాల్వను స్థానికుల సహకారంతో కొందరు బిల్డర్లు ఆక్రమించారు. కాల్వపైనే భవన నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు పనులు ఆపాలన్నా ఆపకుండా కాల్వపైనే భవన నిర్మాణాలు చకచక జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీంతో ఆయన కాల్వ ఆక్రమణ జరగకుండా చూడాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గతంలో లక్షలు ఖర్చు చేసి కాల్వను అభివృద్ధి చేశారు. ఇటీవలే కాల్వ ఆక్రమణకు గురవుతుందని స్థానికులు తెలిపారు. మునగనూర్ మధ్యలో నుంచి ఉన్న దాదాపు రెండు కిలోమీటర్ల కాల్వ అడుగడుగునా కబ్జాకు గురవుతుంది. అధికారులు స్పందించకుంటే మరికొన్ని రోజుల్లో భవన నిర్మాణాలే పూర్తి అయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి కాల్వను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాల్వపైన నిర్మించే భవనానికి మున్సిపాలిటీ అనుమతులు ఎలా వచ్చాయి. విద్యుత్ మీటర్ ఎలా వచ్చిందో అధికారులు చెప్పాల్సి ఉంది.



కాల్వపైన బిల్డర్లు నిర్మిస్తున్న భవనాలు

బేస్‌మెంట్ నిర్మించకుండా ఆపాం

మునగనూర్‌లో కాల్వపై భవనం నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులం కలిసి జాయింట్ పరిశీలన చేశాం. బేస్‌మెంట్ వద్దనే పనులు ఆపాం. అయినా వారు కడుతున్నారు. మున్సిపల్ అధికారులతో కూడా మాట్లాడాం. సర్వేచేసి దాన్ని తొలగిస్తాం.

- రజాక్, ఇరిగేషన్ ఏఈ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం